స్కెచ్

# వినాయకుడి పెళ్లి

అంగర సూర్యారావు

"బాణా సంచాకు రెండువేల రూపాయలు ప్రత్యేకించాలి" అన్నాడు వినాయకరావు.

"అలాచేస్తే కావలసినంత ఘనంగా వుంటుంది పెళ్లి" అన్నాడు మధ్యవర్తి వెంకన్న.

"మొత్తం ఊరేగింపుకు ఎంతడబ్బు అవుతుందో అంచనా వెయ్యండి!" అన్నాడు వీరభద్రుడు.

వెంటనే వెంకన్న జేబులోంచి కాగితం తీసి జాబితా చదవడం ప్రారంభించాడు. "కోయడాన్సులకు ఐదువందల రూపాయలు. బేండు వాయిద్యాలకు పదిహేను వందలు. సన్నాయి మేళాలకు ఐదువందలు. భోగం మేళాల్ని ప్రభుత్వం నిషేధించింది గనక మధ్య మధ్య మేజువాణీలు జరిపించడానికి రెండువేల అయిదువందల రూపాయలు. పెళ్లికొడుకును ఊరేగించేందుకు లైట్లతోను, ఫేన్‌లోను కారు డెకొరేషనుకు రెండువేల రూపాయలు. తరవాత పోలీసు సిబ్బందికి డిన్నర్ రూపంలోను తదితర రూపాలలోనూ ఖర్చు వెయ్యి రూపాయలు......"

మాట మధ్యలో అందుకొని "పోలీసు వాళ్లెందుకు?" అన్నాడు వినాయకరావు.

పోలీసువాళ్లు లేనిదే ఏపనీ జరగని రోజులాయివి నాయనా! ముష్టివాళ్ళ గోల అణచడానికీ, ఊరేగింపులో అల్లరిచేసే వాళ్లను డొక్క చీల్చడానికీ పోలీసులు అవసరం. మొన్న రామబ్రహ్మంగారి యింట్లో పెళ్లికి పోలీసుల్ని పెట్టనందువల్లే రసాభాస అయింది." అన్నాడు తన పాత అనుభవాన్ని ఉద్ఘాటిస్తూ వెంకన్న.

"పెళ్లిరోజు కూచిపూడి భరత నాట్యాలు పెట్టిస్తే బాగుంటుందేమో!" అన్నాడు వీరభద్రుడు.

"ఈ సినిమాడాన్సుల రోజుల్లో కూచిపూడి భాగవతాలు ఎవరు చూస్తారయ్యా! రెండువేల రూపాయలు యిస్తే చాలు తిలకం తన ట్రూపుతో వచ్చి అతిథులను రంజింపచేస్తుంది." అన్నాడు అనుభవశాలి వెంకన్న.

పెళ్లి వైభవంగా పూర్తి కావడానికి ఇరవై వేల రూపాయలు అంచనా వెయ్యడం జరిగింది. ఎవరి పెళ్లికి యీ సంరంభం అంతా?

వీరభద్రుడు ఒక దేశనాయకుడు. అతని తమ్ముడు వినాయకుడు. వీరభద్రుడు తనకు కుడిభుజం అయిన వినాయకరావుకి మహా వైభవంగా పెళ్లి చెయ్యడానికి నిశ్చయించాడు. అందుకే యీ హడావిడిఅంతా! అందులోనూ ధనవంతులకు యివి మరీగడ్డురోజులు. ప్రతివాడూ డబ్బున్న వాణ్ణి విమర్శించే వాడేకదా? కాంగ్రెస్‌పార్టీ, జస్టిస్‌పార్టీ మినహా యావద్రాజకీయ పార్టీలవాళ్ళూ, ధనవంతులు నశించాలి– దరిద్రులు ఉత్పత్తి కావాల నేవాళ్లేకదా–యిదేం ఘోరంరా దేవుడా! అనుకుంటాడు వినాయకరావు.

అయితే వినాయకరావుకు యింకా సందేహాలు వున్నై. తాను తెలివితేటలు వుపయోగించి (బ్లాక్ మార్కెట్ అయితేనేం, వైట్ మార్కెట్ అయితేనేం) సంపాదించిన డబ్బును చూసి పైవాళ్ళు ఏడవాల్సిన అవసరం ఏమొచ్చింది అనేది ఒక సందేహం. స్వార్థత్యాగం వల్ల అసెంబ్లీ సభ్యుడైన అన్నగారిని ప్రజలు విమర్శించడంలో ఏమైనా అర్థంవుందా అనేది మరో సందేహం. అన్నగారు ప్రభుత్వంలో మనిషి అయినంతమాత్రాన్ని తనకు లైసెన్సులు, పర్మిట్లు ఉండకూడదనడంలో ఏమైనా సబబు వున్నదా అనేది యింకో సందేహం. ఇలానే యింకా ఎన్నో సందేహాలు.

ఏది యెలావున్నా వినాయకరావు పెళ్ళికి ఊరంతా కోలాహలంగా వుంది. బంధుమిత్రులు

షడ్రసోపేతమైన భోజనం ఆరగించి పట్టుతివాసీలపై సుఖాసీనులై సినిమా తారలు, లంకపుగాకు చుట్టలు వగైరా రకరకాల సమస్యలపై చర్చలు సాగిస్తున్నారు. చదరంగం ఆడుతున్నారు. వినాయకరావు మూడవ అంతస్తుపై సోఫాలో కూర్చుని సిగరెట్టుపొగ ఆకాశంలోకి వదులుతూ "తీయని వెన్నెల రేయి" రికార్డు వింటూ క్రింద-భూమిమీద మండు ఎండలో కుక్కలు వగైరా క్షుద్రజంతువులతో ఎంగిలాకుల దగ్గర యుద్ధం చేస్తున్న మానవ సమూహాన్ని (!) విలాసంగా చూస్తున్నాడు.

ఆ సాయంత్రం తిలకం నృత్యప్రదర్శనానికి వందలకొద్దీ అతిథులు వచ్చి కూర్చున్నారు. ఆ ప్రదేశమంతా అగరు గంధాలతోనూ, అత్తరు పన్నీరులతోనూ పరిమళిస్తోంది. ఈ పరిమళంలో ప్రొహిబిషన్ వాళ్లు ఎలాపసిగట్టారో తిలకంతో వచ్చిన హార్మోనిస్టును తబలిస్టును తాగేరన్న నేరంకింద అరెస్టుచేసి తీసుకుపోయారు. వాళ్లు లేకపోతే నృత్యమే లేదంది తిలకం. అతిథుల ముఖాలు అప్పుడే చిన్నబోయినై. వీరభద్రుడు ప్రమాదం గుర్తించినవాడై అతిథి సత్కారాలలో ప్రొహిబిషన్ వారికి ఉచితస్థానం యివ్వనందుకు వెంకన్నమీద కోపపడి వ్యయప్రయాసలు భరించి చివరకు హార్మోనిస్టును తబలిస్టును విడిపించుటకు వచ్చారు. ఈ గలభా వల్ల సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కావలిసిన నృత్యం రాత్రి ఏడు గంటలకు ప్రారంభమయింది.

ఆరాత్రి పూరంతా ప్రతిధ్వనించేట్టు మంగళతూర్యారవాలతో ఊరేగింపు ముందుకు సాగింది. వధువు వాలుచూపులతో వినాయకరావును చూసింది. తొండం మినహా అంతా విఘ్నేశ్వరుడులాగే వున్నాడనుకొంది. మేడమీదినుంచి ఆడవాళ్ళ నవ్వులు వినిపించినై. వినాయకరావుకు వాళ్ళ ప్రవర్తన ఏమీ నచ్చలేదు. తారాజువ్వలు ఆకాశంలోకి ఎగిరి నక్షత్రాల్ని తాకుతున్నై. బాణాసంచా ధ్వనులకు చంటిపిల్లలు హడిలిపోయి కెవ్వున కేకపెట్టి ఏడుస్తున్నారు. మందుగుండు సామగ్రి ప్రకాశానికి పూరంతా పట్టపగలయింది. ఒక యువకుడు కారుదగ్గరకు వచ్చి వినాయకరావుకు వినిపించేటట్లు "తగలెయ్యండి నాయనా! చీకటిబజారు సొమ్ము ఎంత తగలేస్తే తరుగుతుంది గనక!" అన్నాడు. ఆ యువకుడు కాలేజీ స్టూడెంటో, కారు కండక్టరో వినాయకరావుకు బోధపడలేదు. ప్రతి దౌర్భాగ్యుడికీ వాక్స్వాతంత్ర్యం యిచ్చినందుకు ప్రభుత్వం మీద వినాయకరావుకు కోపం వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ పొరబాటు గుర్తించినందుకు సంతోషించాడు వినాయకరావు. ఇక్కడికథ యిలావుండగా అవతల మందుగుండు సామాగ్రి కాల్చేవాడు అవ్వాయి పొరబాటుగా వదలడంవల్ల అది నేలబారునే భీభత్సం చేసుకుంటూ పెళ్ళి సమీపంలోనేవున్న కూలీల పేటలో ఇరవైరూపాయల ఖర్చుతో పెళ్ళి జరుగుతూవున్న పెళ్ళి పందిరిపై పడింది. మొత్తంమీద కూలీల పేట అంతా అంటుకుంది. వీరభద్రుడు ప్రమాదం గుర్తించి ఎలక్షను దగ్గరకువస్తున్న యీ రోజుల్లో పలుకుబడి పోతుందని జడిసినవాడై అగ్నిమాపకదళంవారికి ఫోన్ చేశాడు. ఈ పెళ్ళి సంరంభంలో తమను చిన్నచూపు చూడ్డంవల్ల, అగ్నిమాపక దళంవారు పేటంతా కాలిపోయి బూడిదై ఆరిపోయిన తరవాత రోడ్డు ప్రతిధ్వనించేటట్టు గంట వాయించుకుంటూ తమ లారీలను కూలీలపేటలోకి తరలించారు. కాలిపోయినది కేవలం కూలీలపేట అవడంవల్ల ఫిర్యాదులు దర్యాప్తులు వగైరా గొడవ లేకపోయింది.

ఏది యెలాజరిగినా వినాయకుని పెళ్ళి మంగళప్రదంగా ముగిసింది. రాత్రి ఊరేగింపువల్ల ప్రమాదకరమైన గాయాలు తగిలి హాస్పిటల్‌లో చేర్చబడినవాళ్లు అరవైమంది అనిన్నీ కేవలం గాయపడినవాళ్లు ఐదువందల ముప్ఫైమంది అనిన్నీ అధికారవర్గాలవారు ప్రకటించారు.